క్లుప్తంగా

అప్పారావుకు అభినందన



అప్పారావు దంపతులను సత్కరిస్తున్న గల్లా శ్రీనివాస్, కేబుల్ వాసు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ ఎం.అప్పారావు దంపతులను మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 61వ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు)లు శుక్రవారం అభినందించారు. జనసేన నుంచి అప్పారావు తన కుటుంబంతో కలిసి ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో ఆయన ఇంటికి శుక్రవారం నాయకలు వెళ్లి అప్పారావు దంపతులను అభినందించారు. పశ్చిమలో ఆడారి ఆనంద్‌కుమార్ విజయానికి శక్తికి మించి పని చేస్తానని చెప్పారు.

ఘనంగా కొండదేవతమ్మ పరస



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే శ్రీ శివసాయి దుర్గావెంకట అభయాంజనేయ కొండదేవతమ్మ పరస మహోత్సవాన్ని శుక్రవారం 4 గ్రామాల ప్రజలు కలిసి అత్యంత ఘనంగా నిర్వహించారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరస సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో త్రినాథపురం గ్రామ కమిటీ సభ్యులు జూరెడ్డి గంగరాజు, ఇతర కమిటీ సభ్యులు నీలంరాజు, బాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ నూతన కార్యవర్గ ఎన్నిక



షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ కొత్త కార్యవర్గ సభ్యులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ పరిశ్రమలో శుక్రవారం షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అనపర్తి నూకరాజు, ప్రెసిడెంట్‌గా దొడ్డి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పి.చిన్నయసూరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 30 మంది సభ్యులు ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. కార్మికుల సమస్యలు యాజమాన్యం దృష్టిలో పెట్టి త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చంటిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై సీరియస్

విశాఖవిద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పిల్లలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే శివరాత్రి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ.. కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు తరగతులు నిర్వహించినట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.



చంద్రమౌళీశ్వర స్వామి ఆశీస్సులు అందుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్ దంపతులు



90వ వార్డు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తజనం



ఆడారి ఆనంద్‌కుమార్‌కు స్వామివారి విభూది, ప్రసాదం అందజేస్తున్న బ్రహ్మకుమారీలు





బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాలు

శంభో శంకర

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- శివయ్యను దర్శించి తరించిన భక్తులు



పూజలందుకుంటున్న చంద్రమౌళీశ్వరుడు

విశాఖ విద్య: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. శంభో శంకరుడి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 90వ వార్డు సీతారామరాజునగర్‌లోని పార్వతీ చంద్రమౌళీశ్వర ఆలయంలో స్వామివారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, చిన్ని దంపతులు దర్శించుకుని ప్రత్యేక



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ఆయన వేడుకున్నారు. అర్చకులు వారి గోత్రనామాలతో స్వామికి పూజలు చేసి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఆడారి దంపతులకు ఘన స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు చుక్కా ప్రసాద్‌రెడ్డి, నమ్మి శ్రీను, ఎల్లపు వెంకటేశ్వరరావు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఆలయ అధ్యక్షుడు నాగేంద్ర, రామకృష్ణ ఆలయాల కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, మండల క్లస్టర్ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, అనుబంధ సంఘ డైరెక్టర్లు, క్లస్టర్ యువజన విభాగం అధ్యక్షులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. గోపాలపట్నం బంక్ సమీపంలో శివాలయం, గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయం, నాగేంద్ర కాలనీ శివాలయం, పద్మనాభనగర్, నందమూరినగర్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివ పూజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల్లో అర్చకులు, భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీహరిపురం జవహర్‌నగర్‌లోని మైదాన ప్రాంతంలో స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివ పూజలు ఘనంగా చేశారు. అక్కడ నెలకొల్పిన శివలింగానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద కుమార్ బిల్వ పత్రాలతో పూజలు జరిపి, విభూదితో స్వామిని అభిషేకించారు. చెడు అలవాట్ల నుంచి ఎలా తప్పుకోవాలి, దైవ ప్రార్థన వల్ల కలుగే ముక్తి తదితర అంశాలపై నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆడారి తిలకించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బద్రినాథ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, బ్రహ్మకుమారీ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

- మల్కాపురం ఐవోసీ వద్ద గల చింతామణి దుర్గా గణపతి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించారు. మల్కాపురం రెడ్డి వీధిలోని శివాలయం, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



షిప్‌యార్డ్ కాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో శివయ్య

మార్మోగిన శివ నామస్మరణ

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని సోమశేఖర పంచాయతన శివాలయం భక్తుల శివ నామస్మరణలతో మార్మోగింది. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

అందరి లక్ష్యం.. వైఎస్సార్‌సీపీ విజయం

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపు



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. పచ్చ బ్యాచ్, పిల్ల సైనికులకు దడ పుట్టించేలా మనమంతా ఐక్యంగా ఉండాలని, 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' అని ప్రతిధ్వనించేలా నినాదించాలన్నారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నాలుగు వార్డుల జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం అధ్యక్షతన 40, 61, 62, 63 వార్డుల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత సీఎం, మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటింటా పథకాల లబ్ధిని వివరించండి

అతిథిగా పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ముఖ్య నాయకులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు.. కార్యకర్తలను వెంటబెట్టుకుని ప్రతి రోజు తమ పరిధిలోని ప్రాంతాల్లో డోర్ టూ డోర్ తిరిగి పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వాటివల్ల ఎంత మంది లబ్ధిపొందారన్న విషయాన్ని వివరించే బాధ్యత సంపూర్ణంగా తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ఇంకా కొద్ది రోజుల సమయం మాత్రమే ఉందని, నేటి నుంచి ప్రతి కార్యకర్తా ఓ సైనికుడిలా మారి పార్టీ గెలుపునకు శ్రమించాలని కోరారు. అలుపెరుగని కృషితోనే ఘన విజయం సాధించగలమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ చిన్న కష్టం వచ్చినా.. తాను అండగా నిలుస్తానని ఆడారి ఆనంద్‌కుమార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, మండల క్లస్టర్ అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్‌రావు, పూండి మళ్లేశ్వరరావు, నూకరెడ్డి, కేబుల్ వాసు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కష్టపడదాం

- 'పశ్చిమ'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు



సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయ ఫలాలు అందుకునేందుకు అంతా కలిసికట్టుగా కష్టపడదామని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. గోపాలపట్నంలోని ఆయన ఇంటి వద్ద శుక్రవారం జీవీఎంసీ 91, 92 వార్డుల సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించాలన్నారు. ప్రతీ కన్వీనర్ గృహసారథులు, ఆ ప్రాంత పార్టీ నాయకుల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. కుటుంబాభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించాలని సూచించారు. సచివాలయం వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల వల్ల ప్రజలకు పాలన చేరువైన తీరును అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

సీతంపేట: మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. దళితులు రాజకీయాల్లో ప్రవేశించాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం «మహిళా సాధికారత – ప్రభుత్వ విధానాలు» అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలంటే దళితులు, మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం రాజ్యాధికారం ఒక్కటేనని పేర్కొన్నారు. లా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధ మాట్లాడుతూ దళితులకు ఉన్నత విద్య గగనంగా మారిందన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రతరమవుతుందని, మళ్లీ వలసలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంఎస్ ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మహిళా దినోత్సవం



వివిధ వేషధారణల్లో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మల్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం సందడిగా జరిగాయి. సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,కళాశాల ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి దేశంలో మహిళలు సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన మహిళలను గ్రంథాలయాధికారి అజేయ్ సత్కరించారు.

ఎస్ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో..

గోపాలపట్నం: జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో మహిళా దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. ప్రతి ఒక్కరి విజయం వెనుక వెన్నుదన్నుగా మహిళలు నిలుస్తారన్నారు. వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ప్రియ అబ్రహం, నేవల్ సిస్టమ్స్, మెటీరియల్ క్లస్టర్ ప్రథమ మహిళ వై.లక్ష్మి, ఎన్ఎస్‌టీఎల్ ప్రథమ మహిళ ఇలిన్ ధీనా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. ప్రియా అబ్రహం మాట్లాడుతూ కోవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు చేసిన కృషిని వివరించారు. అనంతరం రామ్‌నాథ్ సెకండ్రీ స్కూల్‌లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగితో పాటు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. మహిళా ఉద్యోగులకు, పురుష ఉద్యోగుల జీవిత భాగస్వాములకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

- గోపాలపట్నం రైతు బజారు దరి శానిటరీ కార్యాలయం వద్ద మహిళా కార్మికులకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను అందరం గౌరవించాలన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు సత్యనారాయణ, బి. వెంకటరమణ తదిరులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్న వారితో అతిథులు



గోపాలపట్నం రైతుబజారులో మహిళలను సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. సుమారు 65 ఏళ్ల వయసున్న అతని ఎత్తు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లకు గానీ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. వివిధ ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



కేక్ కట్‌చేస్తున్న విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు'అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో ప్రమాదం

- ఇద్దరి కార్మికులకు గాయాలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. సంస్థలో పైప్‌లైన్ నుంచి స్టీమ్ ఫోర్స్‌గా రావడంతో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు గాయాలయ్యాయి. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ సింగ్, షాయిద్ మైతీ ఉపాధి నిమిత్తం గతేడాది మల్కాపురం వచ్చారు. హెచ్‌పీసీఎల్‌లోని సీఆర్–3 అనే సంస్థలో ప్రమోద్‌సింగ్ ఫోర్‌మన్‌గా, షాయిద్ మైతీ రిగ్గర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థ ఆవరణలో డీహెచ్ఎస్‌పీఎఫ్ఆర్‌యూ ప్లాంట్ యూనిట్‌లో కొన్ని రోజుల నుంచి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ పైపుల్లో చమురు వంటి మడ్డి వంటి పదార్థాలు నిలిచిపోయాయి. దీంతో స్టీమ్‌ను ఆ పైపుల్లోకి ఎక్కించి, ఆ స్టీమ్ ద్వారా మడ్డిని బయటకు తీస్తున్నారు. ఐదు రోజులుగా ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ప్రమోద్‌సింగ్, షాయిద్ మైతీ ఈ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో పైపుల్లోని స్టీమ్ ఫోర్స్‌గా ఒక్కసారి బయటకు రావడంతో అక్కడ ఉన్న ప్రమోద్, మైతీ గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని సంస్థ అంబులెన్స్‌లో నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మోజెస్‌పాల్, మల్కాపురం సీఐ సన్యాసినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వివరాలు సేకరించారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం శుక్రవారం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సుదర్శన పెరుమాళ్లను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన నిర్వహించారు. పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.